తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# వ్యామోహంతో... చెడు వ్యసనాలకు లోను కావద్దు

**-ఎస్వీ వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు**



తిరుపతి విద్య, నవంబర్ 22 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ,పీజీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థి సంఘం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.తిరుమల నారాయణమ్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వీ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం.భూపతి నాయుడు విచ్చేసి మాట్లాడుతూ మార్క్స్ మెరిట్స్ తో ఆఫీస్ బేరర్స్ గా ఎన్నికైన విద్యార్థినులందరికీ అభినందనలు తెలియజేశారు. భగవంతుని ఆశీస్సులతో ఉచిత విద్య,భోజనం సౌకర్యాలను అందిస్తున్న ఈ కళాశాలలో సీటు రావడం అదృష్టమని తెలిపారు.టెక్నాలజీ వ్యామోహంతో ఉన్న నేటి యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారు.గూగుల్ తల్లి కన్నా గురువు మిన్న అని నొక్కి వక్కాణించారు.సమయం ఎంతో విలువయింది.సమయాన్ని వృధా చేయరాదు. మీరు వేసే ప్రతి అడుగులోను మీ తల్లిదండ్రుల కష్టం గుర్తుకు రావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. తిరుమల నారాయణమ్మ మాట్లాడుతూ 2024-2025 విద్యా సంవత్సరంలో జరిగిన పరీక్షా ఫలితాల్లో 92 శాతం ఉత్తీర్ణతను సాధించారన్నారు. 2025-2026 విద్యా సంవత్సరంలో 1202 మంది విద్యార్థినులు అడ్మిషన్లు పొందారని తెలిపారు. రూరల్ డెవలప్మెంట్, ఫుడ్ టెక్నాలజీ వంటి మేజర్ కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. విద్యార్థులందరూ క్రమ శిక్షణను కలిగి విద్యను అభ్యసించాలని తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం. కనుక అన్నం వృధా చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్చార్జ్ డా.బి.జ్యోతి, వార్డెన్ డా.మల్లీశ్వరి దేవి,డా. విద్యుల్లత డా.వై. సునీత,డా.కస్తూరి,డా. శోభ, డా.జయశ్రీ,డా. శ్రీలత, డా.ప్రవీణ, డా.పద్మిని,డా. విజయ కుమారి, డా.లక్ష్మీ సంధ్య, డా. లక్ష్మీదేవి, డా. శ్రీని వాసులు, డా. వి. కృష్ణవేణి, డా. శిరీష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సుప్రీం ఆదేశాలు పాటించరా!

**యథేచ్ఛగా జనసంచారం మధ్యనే గ్రామసింహాలు -అలిపిరిలోనూ భక్తుల మధ్యలో పరుగులు**



వీధుల్లో సంచారం చేస్తున్న కుక్కలు

ప్రభాతవార్త-తిరుపతి: వీధుల్లో తిరుగాడే శునకాలు ..కొన్ని చోట్ల గుంపులుగా ఉంటూ చిన్నపిల్లలపై, పెద్దలపై దాడిచేయడం, కరవడం వంటి సంఘటనలు జరుగుతుండటంతో వీధిశునకాలను వెంటనే పట్టుకుని దూరంగా తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా గ్రేటర్ తిరుపతిగా రూపుదిద్దుకోనున్న నగరంలో అమలుకావడం లేదు. వీధుల్లో తిరిగే శునకాలను పట్టుకుని తరలించడంలో నగరపాలకసంస్థ ఆరోగ్యవిభాగం ప్రేక్షకపాత్ర వహిస్తోందనే ఆరోపణలు ప్రజల నుండి వెల్లువెత్తుతున్నాయి. ఇదేగాక తిరుపతి యాత్రాస్థలం కూడా కావడంతో నిత్యం గోవిందనామస్మరణలతో మార్మోగే అలిపిరి నడకదారి ప్రాంతంలో, అలిపిరి లగేజీ కేంద్రం ప్రాంతంలో శునకాలు యాత్రికుల మధ్యనే తిరుగుతున్నాయి. ఈ శునకాలు ఎలా దాడిచేస్తాయో,ఎవరిని కరుస్తాయనే భయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామసింహాలు చిన్నపిల్లలపై ,ప్రజలపై దాడిచేసి కరుస్తున్న సంఘటనలతో సుప్రీంకోర్టు కూడా తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది. వెంటనే వీధుల్లో తిరిగే శునకాలను పట్టుకుని తరలించాలని ఆదేశించింది. అంతేకగా నగరపాలకసంస్థ అధికారులు దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొంది. మరీ యాత్రాస్థలం తిరుపతికి ,అలిపిరిలో భక్తులు పెద్దసంఖ్యలో నిరీక్షిస్తుంటారు. తిరుపతిలో దొడ్డాపురంవీధి సమీపంలో ఓ చిన్నారిపై శునకం దాడిచేసి మొహంపై కరిచింది. చిన్నారిని హుటా హుటిన కుటుంబసభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇంకా రోజువారీగా ఐదారుమంది వరకు రుయా ఆస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తున్నారనేది వైద్యవర్గాల సమాచారం. తిరుపతిలో యాభైడివిజన్లలో దాదాపు వెయ్యివరకు వీధి కుక్కలు సంచారం ఉంది. ఏ వీధిలో చూసినా శునకాలు తిరుగుతున్నాయి. మనుషులను చూస్తే అరవడం, పైపైకి ఎగబడటం చేస్తుండటంతో చిన్నపిల్లలు కూడా వీధుల్లో తిరగాలంటే భయపడు తున్నారు. అనేక ప్రాంతాల్లో కుక్కకాటుతో చిన్నపిల్లలు,పెద్దలు అనేక ఇబ్బందులు పడుతుండటంతో సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. ఇటీవల వీధి కుక్కల బెడదపై కీలక ఆదేశాలు జారీచేసింది. ప్రజలు సంచరించే ప్రాంతాలు, జనావాసాల మధ్య, విద్యాసంస్థలు, ఆలయాలు, ఆస్పత్రులు, బస్స్టాండులు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు వంటి ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టుకుని నగరపాలకసంస్థ అధికారులు వెంటనే దూరంగా వదలిపెట్టాలని ఆదేశించింది. పట్టుకున్న కుక్కలను స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేసిన తరువాత నిర్దేశించిన ప్రాంతాల్లో వదలిపెట్టాలని ఆదేశాలు వెలువడించింది. ముఖ్యంగా తిరుపతిలో అనేక ప్రాంతాల్లో, వీధుల్లో కుక్కల బెడద తీవ్రమైంది. అలిపిరి వంటి యాత్రాస్థలంలో, రుయా ఆస్పత్రి పరిసరాల్లో కుక్కలు పెద్దగా తిరుగాడుతున్నాయి. ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశాలిచ్చింది. అయినా తిరుపతి నగరంలో నగరపాలకసంస్థ ఆరోగ్యవిభాగం, టిటిడి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనేది వీధుల్లో తిరుగుతున్న కుక్కల్ని చూస్తే అర్థమవుతుంది. ప్రజల భద్రతతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం లేకపోవడం విచారకరం.

# గిరిజనుల బతుకులు మారేనా!

**కనీస అవసరాలు కరువై... వర్షం వస్తే కూలుతున్న గుడిసెలు-ఆందోళనకు దిగటానికి సిద్ధమౌతున్న గిరిజనులు**



గంగలపూడి గిరిజన కాలనీలలోని గుడిసెల దుస్థితి

శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 22 ప్రభాతవార్త : పాలకులు మారినా తరాలు మారుతున్నా,వచ్చిన ప్రతి ప్రభుత్వం లక్షల ఇళ్ళు నిరుపేదల పేరుతో నిర్మిస్తున్నా గిరిజనుల బతుకులు మారటం వారి గుడిసెలకు మోక్షం లభించటం లేదు.వారు అడవుల్లోకి వెళ్ళి పుల్లలు ఏరుకోవటం అమ్ముకొని జీవనం గడపే పరిస్తితి మారలేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో గిరిజన కాలనీలు అధికంగా ఉన్నాయి. సాధారణంగా సమాజానికి దూరంగా నివసించే గిరిజనుల అభివృద్ధి గురించి ఇటు పాలకులు కానీ అటు అధికారులు పట్టించుకోరు. పాలకులు,రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో వారి ఓట్లు కోసం పరుగులు తీస్తారు. అరచేతిలో స్వర్గం చూపుతారు. ఈ నేపథ్యంలో వర్షాలు వస్తే కూలుతున్న గుడిసెలు. కూటికి లేక కుములుతున్న కుటుంబాల దీన వ్యధను పట్టించుకునే వారు కరువయ్యారు. శ్రీకాళహస్తి మండలంలో పెద్ద పంచాయతీ గంగల పూడి ఇక్కడ గిరిజన కాలనీ ఉంది. ఈ కాలనీలో అన్ని సమస్యలే.ప్రభుత్వాల లక్షల ఇళ్ళను పేదలకు అందిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇ పేదల్లో గిరిజనులు లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో గంగల పూడి గిరిజన కాలనీలో పూరి గుడిసెలు కూలాయి. నివాసం కోల్పోవటంతో కొన్ని రోజులు పునరావస కేంద్రంలో తలదాచుకున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని గిరిజనులు బాధితులుగా మారారు. ఉన్న ఆరకొరా నిత్యావసర వస్తువులు తడిసి అర్థాకలి మిగిల్చాయి. ఈ కాలనీ పక్కనే గిరిజన కాలనీ ఉండటంతో వర్షాలు వస్తే నీరు గిరిజన కాలనీలోని ఇళ్ళలోకి ప్రవహిస్తుంది.నిత్యం నీటిలో ముగ్గుతుండటంతో నిత్యం అనారోగ్యానికి గురౌతున్నారని బాధితులు వివరించారు.ఈ సమస్యలను గిరిజనులు పలు మార్లు ఆర్డిఓ, ఎంఆర్ఓలకు మొరబెట్టుకున్నా ప్రయోజనం లేదని తెలిసింది. ఇక్కడ ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకొని అనుభవిస్తుండగా ఆ భూమిని గిరిజనులు కోరగా అధికారులు స్థానికేతరులకు కొమ్ముకాస్తూ బెదిరిస్తున్నట్లు వాపోతున్నారు. అసలే సమాజానికి దూరంగా ఉండే గిరిజనులు ఏ సమస్య వచ్చినా అధికారులకు విన్నవించుకోవాలన్నా భయభ్రాంతు లౌతున్నారు. ఇక్కడ సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానికేతరులు అక్రమించుకొని అనుభవిస్తున్నారు.దీనిని ప్రభుత్వాధికారులు స్వాధీనం చేసుకొని నిరుపేదలైన గిరిజనులకు అందిస్తే జీవనోపాధితో పాటు పక్కాగృహాలు నిర్మించవచ్చునని చెబుతున్నారు. అయితే ఎంతో కాలం తమ సమస్యల గోడు విన్నవించుకున్న గిరిజనులు ఇక విధి లేక ఆందోళనకు దిగటానికి సిద్ధ పడుతున్నారు.

# విశేష పంచమి తీర్థంకు... కట్టుదిట్టమైన భద్రత

**- పోలీసు, విజిలెన్స్, టీటీడీ సమన్వయంతో వ్యవహరించాలి**
**- ఆయా శాఖల ఉన్నతాధికారులు ఆదేశం**



అమ్మవారి పంచమితీర్థం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

తిరుచానూరు, నవంబర్ 22 ప్రభాతవార్త: పద్మావతి అమ్మవారి పంచమి తీర్థం విస్తృత ఏర్పాట్లు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించాలని తిరుపతి యస్పి సుబ్బారాయుడు, జేఈఓ వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్ఓ మురళీకృష్ణ సమీక్ష సమావేశంలో తమ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో భక్తులకు చేయనున్న వివిధ ఏర్పాట్లను వివరించారు. ఇందులో భాగంగా హోల్డింగ్ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్కు అనుసంధానం చేయడం ద్వారా పర్యవేక్షణ బలోపేతం చేసామన్నారు . అదనంగా డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరిపి, లైవ్ ఫీడ్ ఆధారంగా తక్షణ స్పందన చర్యలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టడం జరగనుంది అని తెలిపారు.ప్రతి హోల్డింగ్ పాయింట్ వద్ద అదనపు ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులను బాధ్యతలతో నియమించి రోపార్టీలు, భక్తుల క్రమశిక్షణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణపై నిఘా అమలు చేయనున్నట్లు వివరించారు. అలాగే మెడికల్ టీంలు, ఫస్ట్ ఎయిడ్ సేవలు, అంబులెన్స్లు సిద్ధంగా ఉంచబడడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవి మనోహర ఆచారి, డీఎస్పీలు వెంకట్ నారాయణ , ప్రసాద్, విజిఓ గిరిధర్, సిఐ సునీల్ కుమార్, ఏవీఎస్ ఓ రాధాకృష్ణమూర్తి,ఎస్సై సాయినాథ్, జగన్నాథం, అరుణ పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు కేంద్ర పథకాలు అందించాలి

**-దిశా సమావేశానికి గైర్హాజరు అయితే చర్యలు తప్పవు**
**-జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి, కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్,నవంబర్ 22 ప్రభాతవార్త: అర్హులైన పేదలకు కేంద్ర పథకాలు ప్రజలకు తప్పక అందించాలని, అధికారులు చిత్తశుద్ధితో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పేద బడుగు బలహీన వర్గాల ఉన్నతి కొరకు పనిచేయాలని తిరుపతి ఎం.పి. మరియు దిశా చైర్మన్ ఎం. గురుమూర్తి అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా సమన్వయ అభివృద్ధి మరియు పర్యవేక్షణ కమిటీ (దీ।శీబీతి) సమావేశంలో గతంలో చర్చించిన పలు అంశాలపై తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులతో తిరుపతి పార్లమెంట్ సభ్యులు, దిశా చైర్మన్ ఎం. గురుమూర్తి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్తో కలసి సమీక్ష నిర్వహిం చారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై శాఖల వారిగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తూ పార్లమెంట్ సభ్యులు మరియు దిశా చైర్మన్, జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. పార్లమెంట్ సభ్యులు, దిశా చైర్మన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి గ్రామ ఆదర్శ యోజన, ఎం.జి.ఎన్.ఆర్.ఈ జి.ఎస్., పి.ఎం కుసుం, పి.ఎం సూర్య ఘర్ తదితర పథకాలను అర్హులైన లబ్దిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల ముంతా తుఫాన్ నేపథ్యంలో కె.వి.బి పురం మండలము లో రాయల చెరువు గండి పడడం వల్ల కలత్తూరు గ్రామములో తీవ్రంగా నష్టపోయిన గ్రామ స్తులకు ఆర్థికముగా అన్ని విధములుగా సహాయ సహకారములు అందిం చాలని, రైతుల పొలాల్లో ఇసుక మేటలను తొలగించుకొనుటకు, ఆవులు, గేదెలు, మేకలు, కోళ్ళు కోల్పోయిన వారికి, పంట నష్టం కలిగిన వారికి తిరిగి వ్యవసాయము చేసుకోనుటకు రైతులకు కావలసిన విత్తనములు సరఫరా చేయుటకు సంబందిత అధికారులు తగు చర్యలు తీసుకోనవాలన్నారు. రైతులకు పంట నష్టం కలిగినందున ఇన్సురెన్స్ నగదును వారికి చెల్లించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కే వి బి పురం మండలం నందు జరిగిన విపత్తుకు తన ఎం.పి ల్యాడ్స్ నిధుల నుండి ఒక కోటి రూపాయల నిధులను విడుదల చేస్తున్నానని ఈ సందర్భంగా తెలిపారు. రేణిగుంట, నాయుడుపేట హైవే నందు తరచూ ప్రమాద ములు జరుగుతున్నాయని వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవా లన్నారు. పలు చోట్ల సర్వీసు రోడ్లను ఏర్పాటు చేయలని, గ్రామా లలో కనెక్టవిటీ రోడ్లు లేని చోట వీటి ఏర్పాటుకు సంబందిత అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం నుండి అమలు అవుతున్న పథకాలను సమన్వయంతో అమలు కొరకు జిల్లాల్లో సమన్వయ అభివృద్ధి మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం మూడు నెలలకు ఒకసారి నిర్వహించుకునేలా కేంద్ర ప్రభుత్వ నిర్దేశాలు మేరకు నిర్వహించు కుంటున్నా మని, ప్రధాన మంత్రి ఈ అంశంపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ ఉంటారని అన్నారు. దిశా సమావేశానికి గైర్హాజరు అయితే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల జిల్లా పరిషత్ సిఈఓ రవి కుమార్నాయుడు, నెల్లూరుజిల్లా సిఈఓ మోహన్ కుమార్, జిల్లాలోని మునిసిపల్ చైర్మెన్లు, మునిసిపల్ కమిషనర్లు, సోషల్ వెల్ఫేర్ డిడి విక్రం కుమార్రెడ్డి, డిపిఓ సుశీలా దేవి,డిఆర్డిఎ పిడి శోభన్ బాబు, డ్వామ పిడి శ్రీనివాస రావు, డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, డిఈఓ కుమార్, వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్, ల్యాండ్ అండ్ సర్వే ఎడి.అరుణ్ కుమార్, ఐసిడిఎస్ పిడి వసంత బాయ్, గనులశాఖ అధికారి బాలాజీ నాయక్, కార్మికశాఖ అధికారి చిన్న లాలప్ప, తిరుపతి స్మార్ట్ సిటి మేనేజర్ చంద్రమోళి, నేషనల్ హైవే పిడి, సంబందిత జిల్లా అధికారులు, తిరుపతి మునిసిపల్ డిప్యూటి మేయర్ ఆర్ సి ముని కృష్ణా, ఎం పిపి లు,సంబందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణరథంపై శ్రీ మహాలక్ష్మి కటాక్షం



తిరుచానూరు, నవంబర్ 22 ప్రభాతవార్త: తిరుచానూరు పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్స వాల్లో ఆరో రోజైన శనివారం సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో ఈ ఉత్సవం వేడుకగా నిర్వహించారు. కాంతులీనుతున్న స్వర్ణ రథంపై శ్రీ పద్మావతి అమ్మవారు విశేష స్వర్ణ, వజ్రాభరణాలను ధరించి భక్తులకు కనువిందు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని స్వర్ణరథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో జేఈవో వి.వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో హరేంద్రనాథ్, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్వర్ణపాదుకలతో... గరుడ వాహనంపై శ్రీవారి దేవేరి

**- సర్వభూపాల వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకారంలో సిరుల తల్లి**
**- వైభవంగా శ్రీవారి స్వర్ణ పాదాలు ఊరేగింపు**



తిరుచానూరు, నవంబర్ 22 ప్రభాతవార్త :తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శనివారంరాత్రి అమ్మవారు శ్రీవారి బంగారు పాదాలు ధరించి గరుడ వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం అమ్మవారు సర్వభూపాల వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకారంలో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలుపు సహస్రనామార్చన నిత్య అర్చన నిర్వహించారు. తర్వాత అమ్మవారి ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపుచేసి దర్బార్ కృష్ణుడు అలంకారంలో పల్లకి వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం తిరు మాడ వీధులలో భజనలు కోలాటాల నడుమ తేజోమయి భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం ఆలయ ముఖమండపం వద్ద స్నపన తిరుమంజనం కన్నుల పండుగగా నిర్వహించారు. సాయంత్రం స్వర్ణ రథంపై శ్రీ మహాలక్ష్మి భక్తులను కటాక్షించారు. తర్వాత వాహనం మండపంకు అమ్మవారి ఉత్సవర్లను వేంచేపు చేసి వివిధ రకాల పుష్పాలు వజ్ర వైడూర్య మణి మాణిక్యాలతో స్వర్ణలంకార శోభితురాలు అయినా పద్మావతి దేవిని శ్రీవారి స్వర్ణ పాదుకలతో అలంకరించి శ్రీహరికి మిక్కిలి ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై కొలువుతీర్చారు. అనంతరం భజనలు, కోలాటాలు నడుమ శ్రీ మహాలక్ష్మి భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కర్పూర నీరాజనాలతో అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈఓ అనిల్ కుమార్ సింగల్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, జేఈఓ వీరబ్రహ్మం సివిఎస్వో కే.వి.మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఆలయ డెప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపర్డెంట్ రమేష్, ప్రసాద్, సీఐ సునీల్ కుమార్, ఏవీఎస్ఓ రాధాకృష్ణమూర్తి, ఎస్ఐ సాయినాథ్ ఆర్జిత ఇన్స్పెక్టర్ చలపతి, వాహనం ఇన్స్పెక్టర్ సుభాస్కర్, ప్రసాదం ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# ఎన్టీఆర్ కలను నిజం చేసిన చంద్రబాబు

**- కృష్ణాజలాలతో కుప్పం సస్యశ్యామలంకు చర్యలు - సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి**



పెద్దవంక శ్రీకనకనాశమ్మ ఆలయం వద్ద ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి



కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త: దివంగత ఎన్టీఆర్ కలను సిఎం చంద్రబాబు నాయుడు కృష్ణాజలాల రూపంలో నిజం చేశారని సిఎం సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా నాలుగో రోజు కుప్పం మండలం పెద్దవంక, నాయనూరు, దాసేగానూరు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మహిళలు, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దివంగత ఎన్టీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టుకోసం కలలుగన్నారన్నారు. సిఎం చంద్రబాబు దాన్ని కుప్పం వరకు తీసుకువచ్చారన్నారు. కృష్ణాజలాలతో కుప్పాన్ని సస్యశ్యామలం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 133 చెరువులను కృష్ణాజలాలతో నింపేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే పాలారు నదిపై చెక్డ్యామ్ల మరమ్మతులు చేయిస్తున్నారన్నారు. అన్నదాతలు రాష్ట్రానికి చాలా ముఖ్యమన్నారు. మంత్రి లోకేష్ చొరవతో కుప్పానికి లిథియం బ్యాటరీ పరిశ్రమ వస్తోందని ఇందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మూడు వేల కోట్లతో అటా కంపెనీ, 1200కోట్లతో అడిడాస్ సంస్థ కుప్పానికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే కుప్పంలో 2203కోట్లతో ఏడు పరిశ్రమలు వచ్చాయన్నారు.వీటిలో మూడు పరిశ్రమలు మహిళల కోసమేనన్నారు. కుప్పంలో ప్రతి ఇంటా సోలార్ వెలుగులు ఉండేలా సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు.

**కుప్పం ప్రజల మనసులో బాబన్న :**

కుప్పం ప్రజల మనసులో బాబన్న ఉన్నారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఇక్కడ నుంచి ఎనిమిదిసార్లు సిఎం చంద్రబాబును ఎమ్మెల్యేగా గెలిపించడంతో పాటు నాలుగుసార్లు ముఖ్యమంత్రి చేశారన్నారు. కుప్పానికి ఏం చేయాలనే ఆలోచన సిఎం చంద్రబాబులో నిరంతరం ఉ ంటోందన్నారు. మహిళల ఆర్థిక ప్రగతికి డ్వాక్రా సంఘాలకు సిఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. కుప్పంలో అలీప్ కంపెనీ ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేదిశగా చర్యలు చేపట్టారన్నారు.

**తమిళంలో మాట్లాడి ఆకట్టుకున్న భువనమ్మ :**

తమిళనాడు సరిహద్దుల్లోని పెద్దవంక, నాయనూరు గ్రామాల్లో నారా భువనమ్మ తమిళంలో కొంతసేపు మాట్లాడి ప్రజలను ఆకట్టుకున్నారు. ఎల్లారూ నల్లా ఇర్కింగళా అంటూ మాట్లాడారు. తాను పుట్టినప్పటి నుంచి పెళ్లయ్యేదాకా మదరాస్ (చెన్నై)లోనే ఉండేదాన్నని పేర్కొన్నారు. అప్పట్లో తెలుగువారిని కూడా మదరాసీలు అని పిలిచేవారన్నారు. అనంతరం ఎన్టీఆర్ తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కాగా గ్రామాల్లో భువనమ్మను చూసేందుకు మహిళలు రోడ్ల వెంబడిబారులు తీరారు. అంతకుముందు నారా భువనమ్మ పెద్దవంక శ్రీకనకనాశమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్నారు. నాయనూరు గ్రామంలో నారా భువనమ్మ దివంగత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ బిఆర్ సురేష్బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కార్పోరేషన్చైర్మన్ రాజశేఖర్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్కుమార్, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, ఎఎంసి చైర్మన్ జిఎం రాజు, రెస్కో చైర్మన్ ప్రతాప్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్,ఏరియా ఆస్పత్రి వైస్చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, మాజీ ఎంపిపిలు సాంబశివం, వెంకటేష్, నేతలు సత్యేంద్రశేఖర్, మురుగేష్,దివాకర్, ధనశేఖర్, తిరుపతి, షరీఫ్, మునాఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్సిసి డే వేడుకల్లో విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు



పుంగనూరు రూరల్ నవంబర్ 22 ప్రభాతవార్త శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సిసి డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 1948లో స్వాతంత్రం అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎన్సిసిని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుని, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించేందుకు శిక్షణా విధానాన్ని అమలు చేశారని తెలిపారు. ఎన్సిసిలో ప్రవేశించే విద్యార్థులు సైన్య శిక్షణతో పాటు నైతిక విలువలు, సేవాభావం అలవరచుకుని మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ హరి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఎన్సిసి ఆఫీసర్ సోమరాజు, లెక్చరర్లు శ్రీనివాసులు, అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నారా భువనమ్మచే చాయ్‌రాస్తా ఔట్‌లెట్ ప్రారంభం

కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త :



కుప్పం పట్టణంలోని బైపాస్ రోడ్‌లో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) సహకారంతో నూతనంగా ఏర్పాటుచేసిన చాయ్ రాస్తా ఔట్‌లెట్‌ను శనివారం సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఆమె తొలి ఛాయ్‌ను కొనుగోలు చేసి ప్రశంసించారు. ఐఐఎం, ఐఐటి గ్రాడ్యుయేట్లు రూపొందించిన ఈ చాయ్‌రాస్తా ఔట్‌లెట్ చాలా సరికొత్తగా ఉందని అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, కమీషనర్ శ్రీనివాసరావు, సంస్థ సిఇఒ మైఖేల్ జోషి, డైరెక్టర్లు పోలుదాసు కిరణ్, ఒంటిపులి పూర్ణచంద్రరరావు పాల్గొన్నారు.

## కర్ణాటకలో 7కోట్ల దోపిడీ...

**కుప్పంలో 5.56కోట్లు పట్టివేత**

కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త : కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో ఏడు కోట్ల దోపిడీ ఘటన కలకలం రేకెత్తించింది. ఈచోరీ కేసుకు సంబంధించి కర్ణాటక పోలీసులు కుప్పంలో నిందితుడి ఇంట్లో 5.56కోట్ల నగదు రికవరీ చేశారు. స్థానిక పోలీసు అధికారులు కర్ణాటక పోలీసులకు సహకరించారు. మండలంలోని కూర్మానిపల్లికి చెందిన నవీన్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో ఈ నగదు పట్టుబడగా కర్ణాటక పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకుని మరలా బెంగళూరుకు పయనమయ్యారు.

## రాముల గుట్ట సమీపంలో చేరిన జంట ఏనుగులు

కుప్ప ం , నవంబర్ 22 ప్రభాతవార్త:

రామకుప్పం మండలంలో పంటలను నాశనం చేసిన జంట ఏనుగులు కంగుంది రిజర్వ్‌ఫారెస్ట్‌లోని కంగుంది పంచాయతీ రాములగుట్ట ప్రాంతంలోకి వచ్చినట్లు ఎఫ్ఆర్వో జయశంకర్ తెలిపారు. వీటిని దారి మళ్లి ంచేందుకు సిబ్బంది, ట్రాకర్లతో కలసి నిఘా ఉంచామన్నారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఎవరూ రాత్రిపూట బయటకు రావద్దని సూచించారు.

## లో ఓల్టేజ్ సమస్య పరిష్కారంకే నూతన సబ్‌స్టేషన్

**– ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి**

వి.కోట, నవంబర్ 22 ప్రభాతవార్త:



విద్యుత్ లో ఓల్టేజ్ సమస్య పరిష్కారంకే నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంబి.స్తున్నట్లు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లింగాపురంలో నూతన సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. రైతులసంక్షేమం కోసం సిఎం చంద్రబాబునాయుడు విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ప్రజలందరికీ కూటమి ప్రభుత్వంతో మేలు కలుగుఒందన్నారు. నూతన సబ్‌స్టేషన్ నిర్మాణంతో బిసి పల్లి, చింతమాకులపల్లి పంచాయతీల్లో లో ఓల్టేజ్ సమస్య తీరనుందన్నారు. అనంతరం సుద్దలకుప్పం నుంచి కె. గొల్లపల్లి వరకు బండపల్లి మీదుగా 1.10కోట్లతో నిర్మించే సిసి రోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, వైస్‌ఛైర్మన్ విశ్వనాథ్, ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్, ఇఇలు శ్రీనివాసమూర్తి, భాస్కర్ నాయుడు, ఎడిఇ జీవన్‌కుమార్, రెడ్డికుమార్, బాబు, ఎఎంసి ఛైర్మన్ రాజన్న, నేతలు రామచంద్రనాయుడు,రాంబాబు, రంగనాథ్, ఈశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో తెదేపాలో చేరికలు

**వి.కోట, నవంబర్ 22 ప్రభాతవార్త :**



వి.కోట మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ అక్మల్, ఎంపిటిసి రిజ్వానా, ఖలీల్ తదితరులు శనివారం ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి సమక్షంలో తెదేపాలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాంబాబు, ఎఎంసి ఛైర్మన్ రాజన్న, నేతలు రంగనాథ్, రామచంద్రనాయుడు,గజేంద్ర, ఈశ్వర్‌గౌడ్, సుబ్బన్న, నారాయణస్వామి, రూహుల్లా, ఇక్బాల్, ధీరజ్, శబరీష్, అఖిల్, గౌస్‌పీర్, ఉమ్మర్ పాల్గొన్నారు.

## అక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఫ్రూట్ డే

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త



పట్టణంలోని ముత్యాలమ్మగుడిలోని ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్ ప్రైమరి బ్లాక్‌లో శనివారం చిన్నారులకు ఫ్రూట్ డేను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదనరెడ్డి పర్యవేక్షణలో చిన్నారులకు పండ్లమీద అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులను కకూడా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పండ్లను తినటం వల్ల ప్రయోజనాలను వివరించారు. అవి చిన్నారుల ఆరోగ్యానికి ఎలా దోహదపడతాయో వివరించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లలు జింక్ ఫుడ్‌ను తినకూడదని తినిపించకూడదని వివరించారు. జింక్ ఫుడ్ ఆరోగ్యానికి ఎలా హాని కల్గిస్తుందో వివరించారు. ఆరోగ్యానికి పండ్లను అందించాలని శాఖారంలో కూరగాయలు పీచు కల్గిన ఆహారాన్ని అందించాలని సూచించారు. చిన్నారులు పండ్లకు సంబంధించిన నమూనా చిత్రాలను చిత్రపటాల ద్వారా ప్రదర్శించారు.

## వంతెనపై పిట్టగోడ లేక....

పుంగనూరు నంబర్ 22 ప్రభాతవార్త



రామసముద్రం ప్రధాన రహదారిలోని పుంగమ్మకట్ట వద్ద ఉన్న వంతెనకు పిట్ట గోడ లేకపోవడం ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, పాదాచారులతో రోజంతా రద్దీగా ఉండే ఈ మార్గంలో భద్రతా పరిస్థితులు దెబ్బతిన్నాయని స్థానికులు వాపోతున్నారు. వంతెనకు అంచులు లేకపోవడంతో చిన్నపాటి తప్పిదం జరిగినా వాహనం కిందపడే ప్రమాదం ఉందని జనం ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రాత్రివేళల్లో ఈ ప్రాంతం మరింత ప్రమాదకరంగా మారిందని, వీధిదీపాల వెలుతురు తక్కువగా ఉండటంతో డ్రైవర్లు వంతెన అంచును గుర్తించడం కష్టమవుతోందని పేర్కొంటున్నారు. గతంలో రెండు మూడు సందర్భాల్లో ప్రమాదాలు తప్పిన ఘటనలు జరిగినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం ప్రజల్లో అసంతృప్తిని కలిగిస్తోంది. ప్రజల ప్రాణభద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రక్షణ పిట్ట గోడను నిర్మించాలని, ప్రమాదం జరిగితే అధికారులే బాధ్యత వహించాలని స్థానికులు పేర్కొంటున్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

గుడిపాల, నవంబర్ 22 ప్రభాతవార్త:



మండల పరిధిలోని చిత్తపార ఎంపియుపి పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు బెంగళూరులోని స్పిన్ మాస్టర్స్ కంపెనీ సౌజన్యంతో శనివారం విద్యా సామాగ్రి, ఆట వస్తువులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతంకు దాతల సౌజన్యం హర్షించదగ్గ విషయం అన్నారు. గుడిపాల మండలంలో జన్మించి బెంగళూరులో స్పిన్ మాస్టర్స్ కంపెనీ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దాతకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు శ్రీనివాసులు, పశుమంద కస్టర్ ఇన్‌ఛార్జీ నరేష్, సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్ నాయుడు, ఎంఇఒ గణపతి, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, ఎంపిటిసీ హరిప్రసాద్ చౌదరి, మాజీ సర్పంచ్ గోవిందగౌడ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పక్కాగా వ్యర్థాల నిర్వహణ

**– కార్మికుల అవగాహన సమావేశంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్**



**చిత్తూరుహెల్త్, నవంబర్ 22 ప్రభాతవార్త:** నగర పరిధిలో వివిధ రకాల వ్యర్థాల సేకరణ, నిర్వహణను పారిశుధ్య కార్మికులు పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ పేర్కొన్నారు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ స్వచ్చాంధ్రా కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ వ్యర్థాల సేకరణ, నిర్వహణపై కార్మికులకు అవగాహన వుండాలన్నారు. క్షేత్ర స్థాయిలో వ్యర్థాల సేకరణలో పారిశుధ్య కార్మికులే కీలమమని, తడి, పొడి వ్యర్థాలతో పాటు ప్రమాదకరమైన ఇతర వ్యర్థాలను తగిన జాగ్రత్తతో సేకరించాలన్నారు. పారిశుధ్య కార్మికులు తగిన రక్షణ పరికరాలను ఉపయోగించాలని, పిపిఇ కిట్లను వినియోగించడం వల్ల కలిగే లాభాలను ఆయన వివరించారు. అలాగే వ్యర్థాల సేకరణ, నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, రక్షణ పరికరాల వాడుకపై ఏఐఐఎల్ఎస్జి రిసోర్స్ పర్సన్ డాక్టర్ శ్రీనివాస్ రమాదేవిలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధే అజెండాగా విధులు

**– మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి హేమలత సురేష్‌రెడ్డి**

పెనుమూరు, నవంబర్ 22 ప్రభాతవార్త:



అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించి అభివృద్ధే అజెండాగా తీసుకుని మండలంను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని ఎంపిపి హేమలత సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం ఎంపిపి హేమలత సురేష్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిపి హేమలత సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అధికారులే మూలస్థంభాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని, ఈ నిధులు వృధా కాకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సద్వినియోగం చేసి మండలంను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి అత్యధిక అధికారులు గైర్హాజరు అవుతున్నారని, 3 నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం సరికాదన్నారు. ఈ సమావేశానికి ఉద్యాన, ఎక్సైజ్, ఆర్టీసీ అధికారులు గైర్హాజరు కావడంతో ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎంపిడిఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి ఎంపిటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలని, సమస్యలను సమావేశంలో ప్రస్తావిస్తే అధికారులు భయంతో పాటు బాధ్యతతో విధులు నిర్వర్తిస్తారన్నారు. ఈ సమావేశంలో జడ్పిటీసీ దొరస్వామి యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షులు పామూరు శ్రీనివాసులు, డిప్యుటీ తహసిల్దారు శివకుమార్, ట్రాన్స్‌కో ఇఇ తులసీప్రసాద్, పశుసంవర్ధకశాఖ డాక్టర్ సుబ్రమణ్యం, వైస్ ఎంపిపి కోదండన్, ఉపాధి ఎపిఓ గుణశేఖర్, ఎంపిటిసీలు సుభాషిణి, శివలింగం, సుబ్రమణ్యంలు, సర్పంచ్ దూది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.80 వేల జరిమానా

చిత్తూరు, నవంబర్ 22 ప్రభాతవార్త:

చిత్తూరు ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 8 మంది వాహనదారులను శనివారం కోర్టుకు హాజరు పరిస్తే మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. చిత్తూరు నగరంలో శుక్రవారం ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా ఈ సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఎనిమిది మంది ద్విచక్రవాహనదారులు పట్టుబడ్డారు. వీరిని శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఉమాదేవి ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున ఎనిమిది మందికి 80 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

## పాలారు నదిలో నారా భువనమ్మ బోటు విహారం



కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త

మండలంలోని పెద్దవంక సమీపంలో పాలారు నది జలకళతో నిండి ప్రవహిస్తున్ననేపథ్యంలో సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనమ్మ శనివారం పాలారు నదిలో బోటులో విహరించారు. వర్షాలు బాగా కురిసి పాలారు నది నీటితో నిండడం, మరో పక్క కుప్పానికి కృష్ణాజలాలు రావడంతో నారా భువనమ్మ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో వర్క్‌షాప్

కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త :

స్థానిక వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గ్లోబల్ స్కేలర్ సంస్థ అధ్వర్యంలో ఎఐఇఇ ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్లోర్ వర్క్‌షాప్ నిర్వహిం చారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అడాస్ గాడ్జెట్లు, ఫ్లైయింగ్ కార్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ సెన్సర్లు, ఎఐ,కోడింగ్, సైబర్ సెక్యూరిటీ, రోడ్ సేఫ్టీ విద్య తదితరాలపై వివరించారు. కార్యక్రమంలో శిక్షకులు మహేంద్ర, కిషోర్‌కుమార్, అమరనాథ్, లక్ష్మణ్, సాధిక్ జాఫర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## తెలుగు దేశం గ్రామ కమిటీ ఎన్నికలు

కల్లూరు, నవంబర్ 22 ప్రభాతవార్త:

తెలుగు దేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ బలోపేతానికి ప్రతి పంచాయితీలోనూ గ్రామ కమిటీలు నిర్వహిస్తు న్నారు. పుంగనూరు నియోజకవర్గం రాష్ట్ర పరిశీల కులు, విశ్వ బ్రాహ్మణ డైరెక్టర్ రామకృష్ణాచారి, పుంగ నూరు నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కమిటీలు నిర్వహిస్తున్నారు. పులిచర్ల పంచాయితీ పి. వెంకటరమణ (ఫోటో స్టూడియో), గడ్డంవారిపల్లె సుధాకర్ రెడ్డి, 106 రామిరెడ్డిగారిపల్లి జ్యోతీశ్వర్, మంగళం పేట పి. ప్రభాకర్, నన్నూరు వారిపల్లె అధ్యక్షులుగా మునేంద్ర, రాయవారిపల్లె అధ్యక్షులుగా విశ్వనాథ నాయుడు, ఎల్లంకివారిపల్లె విద్యాసాగర్ నాయుడు, కావేటిగారిపల్లె చంగల్రాయ నాయుడు, పోశంవారిపల్లె వాయిదా వేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజుల నాయుడు, సింగల్‌విండో అధ్యక్షులు ధనంజయ నాయుడు, కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, రమేష్, ఎంపిటిసి మునికృష్ణం నాయుడు, గోపి నాయుడు, నజీర్, దేవా, నాగరాజ నాయుడు, శంకర, హరి, దాము, మణి, సురేఖ, యోగానంద రెడ్డి, ప్రకాష్, రామచంద్రయ్య, గోపినాయుడు, ఆయా గ్రామాల్లో తెలుగు దేశం పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాసులకు కక్కుర్తి పడి పిల్లల ప్రాణాలతో చెలగాటం

పాలసముద్రం, నవంబర్ 22 ప్రభాతవార్త



మండలంలోని వన దుర్గాపురం గ్రామం తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో ఇక్కడి నుంచి పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే సుమారు పది కిలోమీటర్లు వెళ్లాలి ఈ గ్రామానికి కేవలం ఒకే ఒక ఆర్టీసీ బస్సు ఉండడంతో ఆ బస్సు సరైన సమయానికి రాకపోవడంతో పిల్లలు ఆటోలో వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది.కాసులకు కక్కుర్తి పడి దీనినే ఆసరాగా చేసుకుని కొంతమంది ఆటో డ్రైవర్లు ప్రభుత్వ నిబంధన ఉల్లంఘించి పరిమితికి మించి సుమారు 15 మందిని ఆటోకి అటు ఇటు వేలాడించుకుంటూ తీసుకెళ్ళు తు పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఆటో యొక్క పరిమితి ఒక డ్రైవర్ తో పాటు ముగ్గురు ప్రయాణికులు మాత్రమే ఇలా పరిమితికి మించి తీసుకెళ్లి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్న ఆటో డ్రైవర్ల పై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాదిద్ధాం



**చౌడేపల్లి, నవంబర్ 22 ప్రభాతవార్త :** సమిష్టి కృషితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాదిద్ధామని రాష్ట్ర పాల ఏకిర కార్పొరేషన్ ఛేర్మన్, మండల తేదేపా సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు నాగేశ్వర్‌నాయుడు అన్నారు. మండలంలోని దిగువపల్లి పంచాయతీకు దేశంపార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళులా భావించి విజయపథంలో నడిపిస్తున్నారన్నారు. నూతనంగా ఎన్నుకున్న పంచాయతీల కమిటీలు తేదేపా విజయానికి పాటుపడాలన్నారు. తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), సింగిల్‌విండో అధ్యక్షుడు హరిరాయల్, పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడిగోపాల్, యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజు, బోయకొండ సుబ్బు, శ్రీధర్‌రాజు(గిరి), పూల చంద్రమౌళి, ఆవుల రామచంద్రయ్య, సోమశేఖర్, శివన్న, రామకృష్ణ, పంచాయతీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా పరిశీలకుడు నాగేశ్వర్‌రావు సొంత కార్యక్రమానికి వెళ్ళడంతో కాటిపేరి, కాగతి, పుదిపట్ల, లద్దిగంలలో జరగాల్సిన పార్టీ సంస్థాగత ఎన్నికలు వాయిదా పడ్డాయి.

## పెళ్ళింట మాజీ మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లి, నవంబర్ 22 ప్రభాతవార్త:



ఆత్మీయుల పెళ్ళింట మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. స్థానిక బైసాని కళ్యాణ మండపంలో సోమల మల్లికార్జునరెడ్డి తనయుడు పెళ్ళికి హాజరైనా పెద్దిరెడ్డి తర్వాత శ్రీలక్ష్మీశ్రీనివాసా కళ్యాణ మండపంలో పిఎల్.కొత్తూరుకు చెందిన ఆర్.నరసింహారెడ్డి కుటుంబంలోని పెళ్ళిలో పాల్గొన్నారు. వైసిపి మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, మిద్దింటి శంకరనారాయణ, జంగాలపల్లి రమణ, వైస్‌ఎంపిపి సుధాకర్‌రెడ్డి, పవన్‌రాయల్, అనుప్రియ, పోస్టు కృష్ణమూర్తి, ఓబుల్‌రెడ్డి, చంద్ర, రామ్‌బాణం శ్రీనివాసులు, షంషీర్, శంకరప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూజిల్లను పరామర్శించిన పెద్దిరెడ్డి

చౌడేపల్లి, నవంబర్ 22 ప్రభాతవార్త:



స్థానిక బజారువీధిలోని నూజిల్ల నాగరాజను మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఇటీవల నూజిల్ల నాగరాజ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకొన్న పెద్దిరెడ్డి ఆయన నివాసానికి చేరుకొని పరామర్శించారు. వైసిపి మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, మిద్దింటి శంకరనారాయణ, జంగాలపల్లి రమణ, వైస్‌ఎంపిపి సుధాకర్‌రెడ్డి, పవన్‌రాయల్, అనుప్రియ, పోస్టు కృష్ణమూర్తి, ఓబుల్‌రెడ్డి, చంద్ర, రామ్‌బాణం శ్రీనివాసులు, షంషీర్, శంకరప్పలు ఆయన వెంట వున్నారు.

## విజయ్ శంకర్‌కు ప్రధాని పరిచయ అవకాశం

పుంగనూరు, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :



రాష్ట్ర ఏబీవీపీ మాజీ కార్యవర్గ సభ్యులు, బిజెపి సీనియర్ నేత జి ఆర్ విజయ శంకర్ కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తో పరిచయం చేసుకునే అవకాశం లభించింది.సత్య సాయి జిల్లా పుట్టపర్తి లో శ్రీ సత్య సాయిబాబా వంద సంవత్సరాల జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి కి వచ్చిన గౌరవ భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడి ని హిల్ వ్యూ స్టేడియంలో మర్యాద పూర్వకంగా కలిసే అవకాశాన్ని పార్టీ నాయకత్వం కల్పించింది. ప్రధాని నరేంద్ర మోడీకి నమస్కరించి నాలుగు దశాబ్దాల తన బిజెపి ప్రయాణాన్ని నాలుగు మాటల్లో వివరించానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి దేశం మీద పెంచుకున్న భక్తి అభిమానం పెద్దయ్యాక తనను ఆర్ఎస్ఎస్ విధానాల వైపు నడిపించిందని, భారతీయ జనతా పార్టీ పతాకాన్ని చేతపట్టి పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసేవలో నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తున్నట్లు వివరించారు. భారతీయ జనతా పార్టీ వేసే ప్రతి అడుగులోనూ అడుగులు వేసారని వివరించారు.

## మైనారిటీ పాఠశాలల అభివృద్ధికి చర్యలు



చిత్తూరురూరల్, నవంబరు 22 ప్రభాతవార్త:

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. శనివారం 50వ వార్డు పరిధిలోని ఏపి రెసిడెన్షియల్ మైనారిటీ బాలికల పాఠశాల ఎమ్మెల్యే సందర్శించి పాఠశాలలోని సౌకర్యాలపై ప్రధానోపాధ్యాయురాలు శోభతో చర్చించారు. ప్రస్తుతం అద్దెభవనంలో నడుస్తున్న పాఠశాలను కన్నన్ పాఠశాలనందుగల భవనంలోకి మార్చేందుకు జిల్లా కలెక్టర్, రాష్ట్రవిద్యాశాఖామంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. పాఠశాలలోని బాలికల కోసం రెండు గీజర్లను సొంత నిధులతో అందజేసి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

***సిమెంట్ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే:***

నగరపాలకసంస్థ పరిధి 50వ పంచాయతీ ఆఫీస్ కార్యాలయం వద్ద రూ. 9.95లక్షలు, ఆర్అండ్‌బి కాలనీ ఏపి మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల వద్ద రూ. 10లక్షలతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి పూజలు నిర్వహించి ప్రారంభించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగర ప్రజల ప్రాథమిక అవసరాలైన రోడ్లు, కాలువలు, వీధి దీపాల ఏర్పాటు పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిననంతరం క్షేత్రస్థాయిలో అభివృద్ధిపనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనరు నరసింహ ప్రసాద్, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మెన్ త్యాగరాజన్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, కాజూరు బాలాజీ, తెదేపా నాయకులు వెంకటేష్‌యాదవ్, లోకేష్‌రెడ్డి, నవీన్‌కుమార్, నళిని, ఉదయ్, ఈశ్వర్, లీలావతి, తెదేపా నగర మహిళా విభాగం నియోజకవర్గ కమిటీ నాయకరాలు, క్లస్టర్, డివిజన్ ఇన్‌ఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండరామస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయండి



**– ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్**

**చిత్తూరురూరల్, నవంబరు 22 ప్రభాతవార్త:**

పురాతమైన, ఎంతో విశిష్టమైన శ్రీ కోదండరామస్వామి దేవస్థానం అభివృద్ధికి కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. శనివారం కోదండరామస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారంకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కమిటీ ఛైర్మెన్‌గా మధునాయుడుతో పాటు మరో 9మంది సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయించారు. మీమీద నమ్మకంతో పదవులు అప్పగించారనీ, దేవస్థానానికి, కూటమి పార్టీలకు మంచిపేరు తీసుకురావాలనీ, హిందూ ధర్మపవిత్రతను కాడాలని సభ్యులకు సూచించారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, కూటమి పార్టీ నాయకులు, కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో ఇంటిలిజెన్స్ అధికారి

శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 22 ప్రభాతవార్త:



ఏర్పేడు మండలంలోని గుడి మల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని సన్నిధిలో విజయవాడ ఇంటిలిజెన్స్ బ్యూరో అదికారి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో దర్శించు కున్నారు. వారికి ఆలయ మర్యాదలతో మాజీ చైర్మెన్ బత్తల గిరిబాబునాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి వేదపండితులు వంశీలు స్వాగతం పలికారు.ఆలయంలో వెలసిన స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## లేబర్ కోడ్‌ని రద్దు చేయండి : సీపీఎం

సత్యవేడు, నవంబరు 22 ప్రభాతవార్త:



సత్యవేడు మండల పరిధిలో కార్మికులకు వ్యతిరేకంగా జారీ చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించు కోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను జారీ చేసిందని, 300 మంది లోపు కార్మికులు పనిచేసే ఫ్యాక్టరీలు, కంపెనీల యజమానులు తమ ఇష్టానుసారం పరిశ్రమలను లే ఆఫ్, లాకౌట్లు చేసుకోవచ్చున్నారు. ఈ లేబర్ కోడ్‌లను కార్మిక సంఘాలు వ్యతిరేకించాలని, 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతున్నారు.ఇకనైనా సదరు మోదీ ప్రభుత్వం ప్రస్తుతం జారీ చేసిన లేబర్ కోడ్‌లను ఉపసంహరించకపోతే పోరాటం ఉధృతమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేశంది, అరుణాచలం, మండల కార్యదర్శి విజయభాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యదర్శి తిరుమలరెడ్డి, ఏకుమలైరెడ్డి, ప్రభుత్వ వైద్యశాల శానిటరీ వర్కర్లు కర్పగం, చిలకమ్మ, శివ, ఎం.శాంతి, కౌసల్య, శాంతి, సోము, మిరియమ్మ, దేవా పాల్గొన్నారు.

## సరిహద్దులో తాత్కాలిక ఉపశమనం

సత్యవేడు, నవంబరు 22 ప్రభాతవార్త:



సత్యవేడు మండల పరిధిలోని గుంతల రోడ్డు మీద ఉన్న ప్రమాదకర మినీ బావులను ఓ టీడీపీ నేత చొరవతో పూడ్చి వేయడం జరిగింది. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సత్యవేడు-కవర్‌పేట రోడ్డు మార్గంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో రోడ్డు అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద మినీ బావులు ఏర్పడడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇదే విషయంపై అయో రామా...ఏంటిది మినీ బావులు...సరిహద్దులో తిప్పలు...అనే శీర్షిక సామాజిక మాధ్యమాల్లో ఫోటోలతో పాటు పరుగులు పెట్టింది. ఈ విషయంపై సీనియర్ టీడీపీ నేత, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వీకేఎన్ పరమశివం(బాషా) స్పందించారు. పరమశివం స్పందనపై స్థానికులు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రసన్న వెంకటేశ్వరునికి ఘనంగా గ్రామోత్సవం

వడమాలపేట, నవంబరు 22 ప్రభాతవార్త:



అప్పలాయగుంటలో అభయ హస్తంతో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామివారికి శనివారం ఊంజల్‌సేవ, గ్రామోత్సవం ఘనంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చిగా స్వామివారు గంటపాటు సిద్విలాసంగా ఊయలలుగూతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడవీధుల్లో విహరించగా భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేట్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు

తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 22 ప్రభాతవార్త :

ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ (పాస్ లేదా ఫైల్)అయినా తిరుపతి ప్రాంతంలో ఉన్న అభ్యర్థులకు మాత్రమే ఈ సదవకాశం 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారుముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 24వ తేదీ: ఉదయం 10.30 గంటలకు తాజ్ హోటల్ నందు ఆధార్ కార్డ్ జిరాక్స్, పదో తరగతి మార్క్ లిస్ట్ జిరాక్స్, ఇంటర్మీడియట్ మార్క్ లిస్ట్ జిరాక్స్, రేషన్ కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు 2 ఫోటోలు, మొబైల్ నెంబర్ రిజిస్ట్రేషన్ కోసం కార్పొరేట్ సంస్థలో ఉద్యోగమునకు అవసరమైన ఇంగ్లీష్, కార్పొరేట్ కంపెనీలకు సంబంధించిన నైపుణ్యమును (స్కిల్స్) మరియు కంప్యూటర్ శిక్షణను ఉచితముగా 45 రోజులు శిక్షణ ఇచ్చి కార్పొరేట్ సంస్థకి పంపబడును. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శాంత స్ఫూర్తి సేవ ఫౌండేషన్, ఫోన్ నెం.9000469989.. ..8309154991..లను సంప్రదిం చాలన్నారు.

## శ్రీ చైతన్య విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ

తిరుపతి విద్య నవంబర్ 22 ప్రభాత వార్త:




తిరుమల బైపాస్ రోడ్డులోని రామచంద్రా నగర్ నందు గల శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రే షన్ (నాసా) సంస్థ నిర్వహించిన పరీక్ష లో 22 మంది విద్యార్థులు ఎంపిక అవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అన్నా గౌరీ మెడికల్ కాల్జ్ ప్రొఫెసర్ ఇన్ ఫార్మకాలజీ డాక్టర్.ఆర్.వి. రామనారాయణ రెడ్డి నాసా యొక్క విశిష్ఠతను విద్యార్థులకు తెలియజేస్తూ,సైన్స్ పట్ల ఆసక్తి కనబరిచే విధంగా ఉపన్యసించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మెగోమి,వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు, డీన్ శివకుమార్,సి ఇన్చార్జ్ రహ్మతుల్లా, నాసా ఇంచార్జ్ ప్రియాంక. విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## డిగ్రీ ఫలితాలు విడుదల

తిరుపతి విద్య, నవంబర్ 22 ప్రభాతవార్త:



శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజ్ (అటానమస్). తి.తి.దే,తిరుపతి నందు డిగ్రి ద్వితీయ సంవత్సరము మూడవ పరీక్షలు 18/11/2025 వరకు నిర్వహించడం జరిగినది.ఈ పరీక్షల ఫలితాలు శనివారం ( ప్రి న్సి పా ల్ డా.ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, వైస్.ప్రిన్స్పాల్ డా వై.మల్లికార్జున రావు, కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ డా పి.వి.చలపతి,డిప్యూటి కంట్రోలర్స్ డా కె.కామేశ్వరరావు,వి. రమేష్,ఎగ్జామినేషన్ సెల్ సభ్యులు,చక్రవర్తి, డా శేషాద్రి,డా హరిహర సురేంద్ర బాబు,డా.నాగరాజు ఆధ్వర్యంలో అందరి అధ్యాపకుల సహయ సహకారాలతో ఫలితాలు విడుదల చేయడం జరిగినది తెలిపారు.

## ర్యాగింగ్ భూతాలను తరిమెద్దాం ఎస్ఎఫ్ఐ

తిరుపతి విద్య, నవంబర్ 22 ప్రభాతవార్త:



ఎస్ఎఫ్ఐ 25 వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని భారత విద్యార్థి ఫెడరేషన్ తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చిగురువాడ లోని గేట్ కళాశాల లో డ్రగ్స్ ఫ్రీ సొసైటీ ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌పై సెమినార్ నిర్వహించారు. తల్లి పాలు నిధి ప్రాజెక్ట్ చైర్మన్, గోవిందాధామం మాజీ అధ్యక్షులు టెంకాయల దామోదరం,మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు డాక్టర్ కిషోర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి సంఘాలే విద్యార్థులను పోరాటాలతో పాటు సమాజం హితం కోసం పాటు పడే విధంగా విద్యార్థులను ఐక్యం చేయాలనీ అన్నారు. అధ్యక్షతన ఎస్ ఎఫ్ ఐ యూనివర్సిటీ నాయకులు నరేంద్ర, ఎస్ ఎఫ్ ఐ నగర కార్యదర్శి తేజ,కళాశాల ప్రిన్సిపాల్ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## అందరి వాడు రంగినేనికి...ముస్లిం నేత సన్మానం

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అందరి వాడులా గుర్తింపబడిన యువ నాయకుడు రంగినేని చెంచయ్య నాయుడుకు శ్రీకాళహస్తి మార్కెటింగ్ కమిటి చైర్మెన్‌గా నియమించటం పట్ల మైనారిటి ముస్లిం నేతలు శనివారం ఘనంగా సత్కరించారు. పట్టణం లోని పంచాతీరాజ్ అతిధి గృహంలో మైనారిటి నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో చెంచయ్యనాయుడు సన్మానాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా చెంచయ్యానాయుడును పూల మాలలతో ముంచెత్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మార్కెటింగ్ కమిటిలో కూడా మొదటి సారి యువ మైనారిటి నాయకులకు అవకాశం కల్పించటం మైనారిటీల పట్ల ఆయనకు గల గుర్తింపు నిదర్శనం అని వివరించారు.కమిటిలో ఇద్దరు ముస్లింలకు అవకాశం బహుశా ఇదే మొదటి సారి అని అభివర్ణించారు. కమిటిలో మహమ్మద్ షఫీతో పాటు మరో మహిళకు అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు చైర్మెన్ ఖాదర్‌బాషా, రాష్ట్రమైనారిటి కార్యనిర్వాహాక కార్యదర్శి షేక్ షాకిర్ అలి, ఖలీల్‌బాషా, జహీర్‌అహమ్మద్,సిఎస్ మీర్జా, ఐటిడిపి ఖాదర్, షఫీ,మహమ్మద్ రఫీ, నయిం, అల్లాబక్షు పకృద్దీన్, సాజిద్, ఫూజైల్, సొహైల్, ఇర్ఫాన్, దొరబాబు, మిన్నల్‌రవి తదితరులు పాల్గొన్నారు.

## చక్రేశ్వరునికి వెండి కిరీటం

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మగుడివీధిలోని చక్రేశ్వరస్వామికి గాంధీవీధికి చెందిన ఓ భక్తుడు సుమారు రూ.4లక్షల విలువ చేసే వెండి కిరీటాన్ని విరాళంగా అందించారు. వై.వెంకటస్వామియాదవ్ ఆధ్యాత్మిక చింతన కల్గిన భక్తుడు ఆయన ఎంతో కాలంగా మహిమాన్వితుడైన చక్రేశ్వరునికి వితరణ ఇవ్వటానికి ప్రయత్నించానని తన ప్రయత్నం ఫలించిందన్నారు.ఆలయ అర్చకులకు శనివారం వెంకటస్వామి యాదవ్ బహూకరించారు. స్వామి వారికి అభిషేకించిన తరువాత కిరీటాన్ని అలంకరించారు.ఈ కార్యక్రమాల్లో వెంకటస్వామి తో పాటు స్వప్న,హరీష్,మన్నెంపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో రామకృష్ణ,ఎంఎల్‌సి

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త:



పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో వెలసిన వాయులింగేశ్వరుని శనివారం మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిరామారావు తనయుడు ఎన్‌టిఆర్ రామకృష్ణ, హైదరాబాదుకు చెందిన ఎంఎల్‌సి టి.జి.జనార్థన్‌లు దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఓ వైపు ఎన్‌టిఆర్ అభిమానులు మరో వైపు తెలుగుదేశం నాయకులు స్వాగతం పలికారు. ఆలయం తరపున దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పిఆర్‌ఓ రవిలు స్వాగతం పలికి వేదమంత్రాలతో స్వామి సన్నిధికి స్వాగతం పలికారు. వారికి స్వాగతం పలికిన తెలుగుదేశం నాయకుల్లో రాష్ట్ర మీడియా ప్రతినిధి శ్రీధర్ వర్మ, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు,గుడ్లూరు మల్లికార్జున్‌నాయుడు, శ్రీకాళహస్తి ధర్మకర్తల మండలి సభ్యులు వాకిచర్ల గురప్పశెట్టి, గోపినాధ్,ప్రేక్‌కుమార్, జీవన్ కుమార్,కాసరం రమేష్, కంఠా రమేష్, పోలూరు శ్రీనివాసులురెడ్డి, ఢిల్లి బాబు,జగదీశ్వరరెడ్డి తదితరులున్నారు.

## కార్మికుల హక్కులను కాపాడాలి : సిఐటియు ధర్నా

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త:




కేంద్ర ప్రభుత్వం అమలుకు పూను కుంటున్న లేబర్ కోడ్లను తక్షణమే ఆపి కార్మికుల హక్కులను కాపాడాలంటూ శనివారం సిఐటియు సారధ్యంలో పట్టణంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్మిక వర్గాల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లతో కేంద్ర ప్రభుత్వం కార్మికుల గొంతులు నొక్కాలని చూస్తుందని ధ్వజమెత్తారు.ఇన్నాళ్ళు కార్మిక సంఘాల బత్తిడితో లేబర్ కోడ్ల అమలులో జాప్యం చేసిన మోదీ సర్కార్ బీహార్ ఎన్నికల్లో విజయం సాధించటంతో ఆచరణకు ప్రయత్నించటం దారుణమన్నారు. ఈ మేరకు పుల్లయ్య మాట్లాడుతూఈ జ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమలులోకి తెస్తే కార్మికులు సమ్మెతో పాటు అనేక ప్రయోజనాలను కోల్పోతారని వివరించారు. ఈ నెల 26న ఎపెద్ద ఎత్తున జరిగే నిరసన ఉల్లంఘన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కార్మికులకు పిలుపు నిచ్చారు.ఈ ఆందోళనలో పుల్లయ్యతో పాటు సిఐటియు నాయకులు గంధం మణి,పెనగడం గురవయ్య, ఈశ్వరయ్య, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా బలోపేతానికి కమిటీలు

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనూ, ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో వైకాపాను బలోపేతం చేయటానికి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రణాళికా బద్దంగా అడుగులు వేస్తున్నారు.ఈ నేపధ్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 1 నుంచి 8 వార్డుల వరకు ఉన్న వైకాపా మద్దతు దారులతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించుటకు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శనివారం అంజూరు తారక శ్రీనివాసులు వార్డుల్లోని పార్టీ మద్దతు దారులు నాయకులతో చర్చించారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీని ఎలా బలోపేతం చేసుకోవాలనే అంశంపై సమీక్షించారు. ప్రతి వార్డులో 15 కమిటీలను ఏర్పాటు చేయుటకు ఒక్కొక్క కమిటిలో 9 మంది సభ్యులుంటారని ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తించుకుంటూ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించుటకు తమ వంతు కృషి చేయాలని శ్రీనివాసులు సూచించారు. ఈ సమావేశాల్లో అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు చంద్రరాజు, పసల రమణయ్య, పసల సుమతి, శ్రీహరి,సురేష్, పఠాన్ ఫరీద్ ఖాన్, మునికృష్ణారెడ్డి, పసల కృష్ణయ్య, పసల సురేష్, కయ్యూరి ఈశ్వరయ్య, కామి వెంకటేశ్వర్లు, వసంత,కయ్యూరి కోదండం, యుగంధర్‌రెడ్డి.సుధాకర్, రమేష్, డాక్టర్ శివశంకర్, సిఆర్‌డి ప్రభాకర్, నాగమ్మ, రాజా, పత్తిమణి, కొట్టె శరవణ, ఆవుల శ్రీనివాసులు, పల్లం గోపి, గాండ్ల ప్రకాష్,భాస్కర్ ముది రాజ్,కమలాకర్,షేక్‌అస్లం జయశంకర్,సుభాష్, రామచంద్రయ్య, బాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయానికి ప్రాధన్యత ఇవ్వండి

-యూరియా వాడకంపై అవగాహన కల్పించండి

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని శ్రీకాళ హస్తి,ఏర్పేడు, తొట్టంబేడు, కెవిబిపురం, బుచ్చినా యుడు కండ్రిగ మండలాల వ్యవసాయాధికారులకు శనివారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో 'ప్రకృతి వ్యవసాయం'కు సంబంధించి ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు.వ్యవసాయశాఖ ఎడిఓ రమేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేడు మారుతున్న వాతావరణానికి సంబంధించి రైతుల్లో అ వగాహన లోపించటంతో మోతాదుకు మించి ఎరువులు వాడుతున్నారని ముఖ్యంగా యూరియా వాడకంతో డిమాండ్ పెరిగిందన్నారు. ఇక యూరియా వాడకం వల్ల వచ్చే అనర్థాలను అన్నదాతలకు వివరించాలన్నారు. అవగాహన సమావేశంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.రవికుమార్, జూనియర్ డిపిపి బి.మధు, ఎన్ఎఫ్ఏ ఎం.వెంకటాచలం తదితరులు వివిధ అంశాలకు సంబంధించి వివరించారు.

## కిడ్నిబాధితుని కుటుంబానికి ఉపాధి

తొట్టంబేడు,నవంబర్ 22 ప్రభాతవార్త:




శ్రీకళహస్తి తెలుగుగంగ కాలనీలో నివాసముంటున్న ఓ కిడ్ని బాధితుని కుటుంబానికి రీచ్ గ్లోబల్ ఎఫౌండేషన్ సారధ్యంలో జీవనోపాధి కల్పించి ప్రశంసలందుకున్నారు. శనివారం సంస్థ నిర్వాహాకులు డాక్టర్ రమేస్‌నాథ్ లింగుట్ల తన ధాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి లోని తెలుగుగంగ కాలనీలో నివసిస్తున్న రేవతి కుటుంబం కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రేవతి భర్త మధు కొంత కాలంగా రెండు కిడ్నిలు పని చేయకపోవటంతో మంచాన పడి ఉండటంతో నిస్సహాయురాలైన రేవతి కుటుంబాన్ని పోషించుకోవటం కష్టంగా మారింది.పిల్లలను చదివించుకోలేని దీన స్థితి చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న తిరుపతి జిల్లా పంచాయతీ అధికారి సుశీలా దేవి ఎందరినో ఆదుకుంటున్న రీచ్ గ్లోబల్ ఫౌండేషన్‌చైర్మెన్ డాక్టర్ రమేష్‌నాధ్ లింగుట్ల దృష్టికి తెచ్చారు. ఆయన స్పందించి ఆ కుటుంబానికి తోడుగా నిలిచారు.ఈ కార్యక్రమాల్లో సుశీలా దేవి, దాత రమేష్‌నాధ్ లింగుట్ల, డాక్టర్ మర్రిమోకల దేవరాజులు, సమగ్ర శిక్షనాధికారి డాక్టర్ సుధాకర్‌నాయుడు, పిజికల్ డైరెక్టర్ గోపాలకృష్ణా తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## స్వచ్ఛ గ్రామంగా తనపల్లి గ్రామ పంచాయతీ

తిరుపతిరూరల్, నవంబర్ 22 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం తనపల్లి గ్రామ పంచాయతీని స్వచ్ఛ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి శుభ్రత పట్ల చక్కని అవగాహన కల్పించారు. పంచాయతీ కమీషనర్ ఆదేశాల మేరకు ప్రతినెల మండలంలోని ఒక గ్రామ పంచాయతీని ఎంపిక చేసి, ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపిడిఓ దయా సాగర్ తెలిపారు. గ్రామంలోని వీధులు, పక్కతొట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సేవా కేంద్రాలు, డ్రైనేజీలు, చెత్త నిల్వ ప్రాంతాలను పూర్తిగా శుభ్రపరిచే పనులు చేపట్టారు. ప్రతి ఇళ్లను ఆ యజమానులు ఎలా శుభ్రంగా ఉంచుకుంటుందో...అదేవిధంగా పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అధికారులు సూచించారు. మండలంలోని ఆరు హ్యాబిటేషన్స్‌కు చెందిన గ్రీన్ అంబాసిడర్లు, పారిశుధ్య కార్మికులు ప్రతి వీధిని శుభ్రం చేసి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ప్రతి రోజు చెత్తను వర్గీకరణ చేసి, తడి, పొడి చెత్తలుగా వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని తెలిపారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్లాస్టిక్ నిషేదం వంటి అంశాలపై ప్రజలకు మార్గ నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవి, తనపల్లి టిడిపి అధ్యక్షుడు కాయం సందీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.నాగార్జున, పంచాయతీ కార్యధర్శులు మురళి, నరసింహులు, సుబ్బరాయుడు, కేశవులు, క్రిష్ణ, సాయి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## మూలాలు మరువని "భానుప్రకాష్"

-దోర్నకంబాల విద్యార్థులకు 20 సైకిళ్ళు

- ఎంఎల్ఏ పులివర్తి నాని ప్రత్యేక అభినందనలు

చంద్రగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త:



జీవితంలో ఎంత ఎదిగినప్పటికీ మూలాలు మరువని భానుప్రకాష్ తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తనవంతు సేవలందించడం అభినందనీయమని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. మండల పరిధిలోని దోర్నకంబాల జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి భానుప్రకాష్ పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని సేవలందించి దాతృత్వానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఎంఎల్ఏ చేతుల మీదుగా విద్యార్థులకు 20 సైకిళ్ళను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ భానుప్రకాష్ గురించి తెలుసుకుని ప్రత్యేకంగా అభినందనలు తెలియజేయడానికి రావడం జరిగిందన్నారు. ఇప్పటికే పాఠశాలకు రెండు గదుల నిర్మించారనీ, సిసి కెమెరాలు అమర్చారనీ, కంప్యూటర్లు ఏర్పాటు చేశారనీ, బీరువాలు అందించారనీ కొనియాడారు. పాఠశాల తరపున ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, హెచ్ఎం డి.జగదీష్, ఉపాధ్యాయులు దాత సేవలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్‌రెడ్డి, టిడిపి చంద్రగిరి పట్టణ అధ్యక్షుడు సక్కుర్ ధనంజయరెడ్డి, చంద్రగిరి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఓంకార్ భరత్‌రాజ్, పాల్గొన్నారు.

## అండర్-14 హాకీ టోర్నమెంట్ ప్రారంభం

చంద్రగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త:



అండర్-14 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో విజయకేతనం ఎగురవేసి జిల్లాకు కీర్తిప్రతిష్టలు అందించాలని ఎంఎల్ఏ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌ను ఎంఎల్ఏ అట్టహాసంగా ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు స్నేహపూరిత వాతారణంలో విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీలకు హాజరైన క్రీడాకారులకు, కోచ్ మేనేజర్లుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పిజికల్ ఎడ్యుకేషన్ భారనుమూర్తిరాజు, డిఈఓ కె.ఎం.కుమార్, డివైఈఓ ఇందిరాదేవి, ఎంఈఓలు శ్రీవరం లలితకుమారి, భాస్కర్‌బాబు, జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ భార్గవి, కిషోర్‌కుమార్, మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్‌రెడ్డి, టిడిపి చంద్రగిరి పట్టణ అధ్యక్షుడు సక్కుర్ ధనంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బీమా 5 లక్షలు అందజేసిన ఎమ్మెల్యే

పుత్తూరు రూరల్, నవంబరు 22 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం నుంచి 5 లక్షల ఆర్థిక సహాయం చేయడం జరిగింది. భార్య గీతని పరామర్శించి మంజూరైన 5 లక్షల ఇన్సూరెన్స్ ఆర్థిక సహాయం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి అందజేశారు.

## షాదిమహల్ మైనారిటీ వర్గానికి అందుబాటులోకి

పుత్తూరు రూరల్, నవంబరు 22 ప్రభాతవార్త:

పుత్తూరు షాదిమహల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుత్తూరు ఎన్జీవో కాలనీ వద్ద ఉన్న షాది మహల్ 2 కోట్ల 41 లక్షల రూపాయలతో గత ప్రభుత్వంలో మైనారిటీ వర్గానికి షాది మహల్‌ని మంజూరు చేసి నిర్మాణం చేపట్టి ఓపెన్ అయి ప్రజలకు మాత్రం అందుబాటులోకి రాలేదు. కార్యక్రమంలో సీపీఐ పుత్తూరు మండల కార్యదర్శి మహేష్, నాయకులు సెల్వరాజా, కృష్ణారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలోస్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్నకు వెండి నక్షత్ర హారతి వితరణ

చంద్రగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన మణికుమార్, మయూర్, కొండల్ రెడ్డి, రాకేష్, రాజేష్ ఉమ్మడిగా వెండి నక్షత్ర హారతిని వితరణ చేశారు. ఈ మేరకు శనివారం ఆలయానికి చేరుకున్న దాతలు ఆలయ ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌కు రూ.2,61,875/- లు విలువ కలిగిన నక్షత్ర హారతిని అందజేశారు. దాతలకు స్వామి వారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## చదువు ఒక్కటే చాలదు అవగాహన అవసరం

రేణిగుంట, నవంబర్ 22 ప్రభాతవార్త:



విద్యార్థులకు కేవలం చదువు ఒకటే చాలదని చదివిన చదువు పట్ల అవగాహన పెంచుకోవాలని రెయిన్బో విద్యా సంస్థల కరస్పాండెంట్ చైర్మన్ అత్త ఉల్లా ఖాన్ అన్నారు. రెయిన్బో విద్యా సంస్థల ప్రధాన పాఠశాలలో శనివారం విద్యార్థులకు స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థులు తమ తరగతుల్లో చదువుకున్న అనేక విషయాలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించి వీక్షకులకు వివరించి అందరి మన్ననలు పొందారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులను కరస్పాండెంట్ అత్తవుల్లా ఖాన్, అకాడమిక్ డైరెక్టర్ ఆరిఫ్, ప్రిన్సిపాల్ షహరాభాను, బోధన బోధనేతర సిబ్బంది అభినందించారు.

## సెన్యార్ తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి

రేణిగుంట, నవంబర్ 22 ప్రభాతవార్త:



తిరుపతి చిత్తూరు జిల్లాలలో సెన్యార్ తుఫాను ప్రభావం అధికంగా ఉందని ప్రజలు అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి అంజూరు చక్రధర్ పిలుపునిచ్చారు. అధికారులు అప్రమత్తంగా ఉంది జన నష్టం, జంతు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం



శ్రీసిటీ,నవంబర్ 22 ప్రభాతవార్త: సూళ్లూరుపేట వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ తడ సూళ్లూరుపేట దొరవారి సత్రం మండలాల రైతు సేవ కేంద్రం పరిధిలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వ్యవసాయ శాఖ సంయుక్తంగా కాదలూరు రైతు సేవ కేంద్రం నందు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో అనుసరించవలసిన పద్ధతులు కషాయాన్ని తయారీ విధానం గురించి రాజీలేని సూత్రాలు వివరించారు. రైతులకు ఆదర్శంగా ప్రకృతి వ్యవసాయంలో అనేక దేశి వరి రకాలున సాగు చేస్తూ మార్కెటింగ్ చేస్తున్న సత్యనారాయణను సన్మానించారు. డివిజనల్ యాంకర్ రవిచంద్ర ప్రసాద్, ఏడిఏ కాంచన, ఏవో కిరణ్, స్వామి కొండయ్య, సత్యనారాయణ, షబీనా పాల్గొన్నారు.

## ముగిసిన 'వార్త' శీనయ్య ప్రస్థానం



సూళ్లూరుపేట, నవంబర్ 22 ప్రభాతవార్త: తడ విలేఖరిగా 40 ఏళ్ల క్రితం తన ప్రస్థానాన్ని ప్రారంభించి 'వార్త' దినపత్రిక 1996లో ప్రారంభించిన వెంటనే అందులో విలేఖరిగా చేరి ఎన్నో విశ్లేషణాత్మక మైన వార్తలు, ప్రజలకు ఉపయోగపడే మంచి సమాచారాన్ని అందించి సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయిలో 'వార్త' శీనయ్యగా పేరు తెచ్చుకున్న పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం రాత్రి పదమపదించారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ప్రయోగం జరిగినా, అక్కడ ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా వాటిని విశ్లేషణాత్మ కంగా ప్రజంటేషన్ చేయడంలో శీనయ్య దిట్ట. అలాగే రాజకీయపరమైన వార్తలతో పాటు సమాజంలో ఉండే సమస్యలపై కూడా మంచి వ్యాసాలు అందించేవాడు. అలాగే తనకున్న సినీ మక్కువతో సినిమాలకు సంబంధించి మంచి ఆర్టికల్స్‌ను అందజేసేవారు. ఎప్పుడు వార్తల కోసం పరితపిస్తూ నిరంతరం వార్తా శ్రామికుడిగా పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు. గత 8 నెలలుగా తీవ్ర అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటూ వార్తలు అందించేందుకు పరితపించేవారు. అటు రాజకీయ నాయకులతో, అధికారులతో, ప్రజలతో మమేకమై తన పాత్రను సమర్థవంతంగా పోషించిన శీనయ్య ఇక లేరన్న నిజం ఈ ప్రాంత వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## జిఎస్‌టి 2.0పై మాక్ అసెంబ్లీ



నాయుడుపేట రూరల్, నవంబర్ 22 ప్రభాతవార్త: పట్టణంలోని ఎల్ఎసాగరం జడ్పీ హైస్కూలులో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించారు. నవంబర్ 26 సంవిధాన్ దివస్‌ను పురస్కరించుకుని జిఎస్‌టి 2.0పై మాక్ అసెంబ్లీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.మీనాకుమారి, ఉపాధ్యాయులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, జి.సుబ్రహ్మణ్యం, జి.ఆనంద్, కోడిపిల్ల చెంచుకుమార్, సుభాష్‌చంద్ర, అమృతవల్లి శ్రావణి, కందనూరు రాఘవేంద్ర, సుధాకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోవూరు ఎమ్మెల్యేకి ఘన సన్మానం

నాయుడుపేట రూరల్, నవంబర్ 22 ప్రభాతవార్త: నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నెల్లూరు నగరంలోని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో జరిగిన జన్మదిన వేడుకల్లో కట్టా వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కట్టా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ టీటీడీ బోర్డు సభ్యులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

## వెంకటయ్యకు మాతృవియోగం

ఓజిలి, నవంబర్ 22 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాడి వెంకటయ్య మాతృమూర్తి గాడి మహాలక్ష్మమ్మ (80) శనివారం కన్నుమూశారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న పలువురు నాయకులు, అధికారులు ఓజిలి మండలం జోస్యులవారి కండ్రిగలోని నివాసానికి చేరుకుని మహాలక్ష్మమ్మ పార్థివదేశానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## సూళ్లూరుపేటలో 479వ నేత్రదానం

సూళ్లూరుపేట, నవంబర్ 22 ప్రభాతవార్త: ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు శనివారం 479వ నేత్రదానం అందింది. మండల పరిధిలోని గోపాల్‌రెడ్డిపాలెంకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, వార్త విలేఖరి పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి (57) పరమపదించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాల నుంచి కార్నియాలు సేకరించి నెల్లూరు ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## వికసిత్ భారతే ప్రధానమంత్రి లక్ష్యం



వెంకటగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త : 2047 నాటికి దేశాన్ని భారత్గా చేయడమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. స్థానిక బిజెపి కార్యాలయంలో ఆయన పార్టీ కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో ప్రధానమంత్రి నడిపిస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి దేశంలో పేదరికం లేకుండా చేస్తారని తెలిపారు. ప్రతి ఇంటికి గ్యాస్ ఇవ్వడమే ప్రధానమంత్రి లక్ష్యం అని తెలిపారు. గ్యాస్ లేనివారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఇస్తారని చెప్పారు. సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు కృష్ణమూర్తి, నాయకులు చెంజి తిరుపాలు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పిడుగు పాటు బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే



వెంకటగిరి, నవంబరు 22 ప్రభాతవార్త : మండలం యాతలూరులో పిడుగుపాటుకు గురై మరణించిన రెడ్డిపల్లి మహేష్ (24) కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇచ్చారు. మహేష్ మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించారు. మహేష్ మరణానికి దారితీసిన పరిణామాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. సెన్యార్ తుఫాను ప్రభావంతో పిడుగుపాటు సంభవించిన ఘటనగా ప్రభుత్వం గుర్తించేలా తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నుంచి లభించాల్సిన ఆర్థిక సహాయం కుటుంబానికి చేరేలా అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు. తుఫాను సమయంలో అప్రమత్తతే ప్రాణాలకు రక్షణ అని ఎమ్మెల్యే అన్నారు.కాగా పిడుగు పడి మృతి చెందిన మహేష్ కుటుంబానికి ఎమ్మెల్యే సూచన మేరకు మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి పూర్తిస్థాయిలో ఆదుకుంటారని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళి గౌడ్, వెంకట చలపతి, వెంకటాచలం తదితరులు ఉన్నారు.

## విద్యతోనే ఉన్నత శిఖరాలు



వాకాడు, నవంబర్ 22 ప్రభాతవార్త: పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు చిన్న వయసులోనే చదివేటప్పుడే ఉన్నత చదువులపై దృష్టి పెట్టి, విద్యతోనే ఉన్నత శిఖరాలును అందుకోవాలని తాహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ అన్నారు. శనివారం వాకాడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఎస్ఏఎలొసి ఈఎఫ్ హై స్కూల్‌లో దాతల సహకారంతో వల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పిల్లలకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంనకు మండల తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్, సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు చిన్న వయసులోనే చదువు మీద ప్రత్యేక దృష్టి పెట్టాలన్ని ఎంపీడీవో సాయిప్రసాద్ దిశ నిర్దేశం చేశారు. ఎస్సై నాగబాబు మాట్లాడుతూ పిల్లలు విద్యుత్‌తో పాటు అనేక క్రీడా రంగాల్లో కూడా ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో హిమ కుమార్, ఇరుగు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## షటిల్ బ్యాట్మెంటన్ కప్పు గెలుచుకున్న విద్యార్థినిలు



గూడూరు, నవంబర్ 22 ప్రభాతవార్త: స్థానిక ఎస్కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు బి. మునిలక్ష్మి థర్డ్ బిఎస్సి, బి.శ్రావణి థర్డ్ బిఎస్సి ఇటీవల జవహర్ భారతి డిగ్రీ కళాశాల కావలిలో జరిగిన విక్రమ సింహపురి విశ్వవిద్యా లయం అంతర్ కళాశాలల ఆటల పోటీలలో రన్నర్ అప్ కప్పు గెలుచుకొని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సింహాద్రి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. నారాయణ రాజు, అధ్యాపక సిబ్బంది విద్యార్థినిలను అభినందించారు.

## మహిళల అభివృద్ధే ధ్యేయం



గూడూరు, నవంబర్ 22 ప్రభాతవార్త: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొదుపు సంఘాలను రాష్ట్రంలో ప్రవేశ పెట్టారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. గత ఐదు సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వంలో పొదుపు మహిళలకు చేసింది ఏమీ లేదని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మధుసూదన్ రావు, అధికారులు, పొదుపు సంఘాల లీడర్‌లు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలి : సిఐటియు



గూడూరు, నవంబర్ 22 ప్రభాతవార్త: గూడూరులో శనివారం జిల్లా కమిటీ పిలుపు మేరకు టవర్ క్లాక్ సెంటర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకురావడం వ్యతిరేకిస్తూ వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. నాయకులు మాట్లాడు తూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడలు తీసుకురావడం చాలా దారుణమని, పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం కొమ్ము కాస్తూ ఉందన్నారు. ఈ లేబర్ కోడ్లను కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తూ 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు పామంజి మణి, బి.వి.రమణయ్య, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, నాయకులు అడపాల ప్రసాద్, వెంకట్రావు, పి.రామయ్య,వి. గోపి, కే.మురళి, ఆర్.మణి, బి. చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## బండి వనమ్మ 4వ వర్ధంతి వేడుకలు



గూడూర్ రూరల్, నవంబర్ 22 ప్రభాతవార్త: మయూరి శ్యామ్ యాదవ్ మాతృమూర్తి బండి వనమ్మ 4వ వర్ధంతి సందర్భంగా మినీ గురుకులం నందు రోటరీ క్లబ్ గూడూరు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ సేవా సమితి దాతృత్వంతో తాగు నీరు సదుపాయాలు ఏర్పాటు చేసిన దాత డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ శనివారంరోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ మాతృమూర్తి దివంగత బండి వనమ్మ 4వ వర్ధంతి సందర్భంగా పాఠశాలకు త్రాగునీరు సదుపాయాలు కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, సెక్రెటరీ మల్లు విజయ్ కుమార్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మేరీ ప్రియత, దాత డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్, హెచ్ఎం కె. వి.రజిని కుమారి, సీనియర్ రోటోరియన్స్ దశరథరామి రెడ్డి, బాలకృష్ణ రాజు, టి సురేష్‌రెడ్డి, కె.నాగసునీల్, నిరంజన్‌రెడ్డి, రోటరీ మేనేజర్ బలరాంరెడ్డి ఉపాధ్యాయునులు అంకమ్మ, లావణ్య, నాగూరమ్మ, రమణమ్మ, చంద్ర,పద్మావతి, లలిత,వనమ్మ,కల్పన, రాజేశ్వరి, విద్యార్థునులు పాల్గొన్నారు.

## సినారెడ్డికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి ఘన నివాళి



శ్రీసిటి,నవంబరు 22 ప్రభాతవార్త : వార్తాపత్రిక సీనియర్ పాత్రికేయులు పర్వత రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి వారి స్వగృహం నందు తుదిశ్వాస విడిచారు. శనివారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శ్రీనివాసులురెడ్డికి ఘన నివాళులర్పించారు ఉన్నతమైన వ్యక్తిత్వగల స్నేహితుడిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. వారితో ఉన్న అనుబంధాలను గుర్తు చేశారు.

## మంచి మిత్రుడుని కోల్పోయాం మాజీ ఎంపీ నెలవల



శ్రీసిటీ,నవంబరు 22 ప్రభాతవార్త : సీనియర్ పాత్రికేయులు పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వారి స్వగ్రామం సూళ్లూరుపేట మండలం తోపుకండ్రిగ గ్రామంలో శుక్రవారం రాత్రి వారి స్వగృహం నందు తుది శ్వాస విడిచారు. శనివారం అంత్యక్రియలు నిర్వహిం చారు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం శ్రీనివాసుల రెడ్డికి ఘన నివాళులర్పి ంచారు మంచి మిత్రుడిని కోల్పోయామని వారితో ఉన్న అనుబంధాలను నెలవల సుబ్రహ్మణ్యం గుర్తు చేసుకున్నారు. వారి వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

## రాములవారి సేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



సదుం,నవంబర్ 22 ప్రభాతవార్త: సదుం మండలం గొంగి వారి పల్లి పంచాయతీ పరిధిలోని రాజీవ్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీరాములవారి ఆలయాన్ని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి శనివారం సందర్శించారు. ఆలయంలో రాముల వారి విగ్రహ ప్రతిష్టాపనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సోమ శేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ నర్మదా నారాయణరెడ్డి, వైసీపీ ఉమ్మడి జిల్లాల ఐటి విభాగం ప్రెసిడెంట్ ప్రకాష్ రెడ్డి, ఎల్ఐసి మోహన్‌రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వికలాంగుల శిబిరాన్ని పరిశీలించిన అధికారులు



సదుం, నవంబర్ 22 ప్రభాతవార్త: మండల కేంద్రమైన సదుం జడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించే వికలాంగులు, వృద్ధుల గుర్తింపు శిబిరాన్ని శనివారం అధికారులు, నాయకులు పరిశీలించారు. ఎమ్మార్వో ప్రమీల మాట్లాడుతూ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎలాంటి అసౌక ర్యాలు కలగకుండ ముందస్తుగా చూడాల న్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రాణి, టిడిపి మండల కన్వీనర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి,రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ అమర్నాథ్ ఇతర మండల సాయి అధికారులు ఉన్నారు.

### జోరువానలోనూ...
## వేకువజామున గోవిందనామసంకీర్తనలు




తిరుపతి,నవంబర్ 22ప్రభాతవార్త: ఆధ్యాత్మికనగరం తిరుపతి ప్రతి శనివారం వేకువజామున భజనలు, గోవిందనామస్మరణలతో మర్మోగుతోంది. కలియుగంలో భగవంతుని నామస్మరణ చేయడానికి భజనలు దోహదం. హరినామస్మరణ, హరినామసంకీర్తన సులువైన మార్గమని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున జోరువానలోనూ తిరుపతిలో రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన గోవిందరాజస్వామి ఆలయ మాఢవీధులు, పురవీధుల్లో భక్తిని చాటిచెప్పింది. యాత్రికుల్లో,నగరవాసుల్లో ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చింది. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొండె చెంగారెడ్డి, వాసుదేవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మునినాథరెడ్డి, భాస్కరాచారి, మునిరత్నమాచారి,, మధు, బ్రహ్మానందం,పద్మావతి, సిద్దమ్మ, జయమ్మ, అరుణ, పార్వతి, రెడ్డిబాబు, కల్పన, ధనలక్ష్మి, తదితరులు తిరునామం ధరించి భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## అమర రాజ క్వాటర్స్ లో భారీ చోరీ!

### 450 గ్రాముల బంగారు, మూడు కేజీల వెండి దొంగతనం




రేణిగుంట, నవంబర్ 22 ప్రభాతవార్త : రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమర రాజ కంపెనీ ఉద్యోగులు నివాసముండే క్వార్టర్స్ నందు శనివారం తెల్లవారుజామున భారీ చోరి జరిగింది. 450 గ్రాముల బంగారం మూడు కేజీల వెండి అపహరణకు గురైనట్లు పోలీసులు తెలిపారు. అమర రాజ కర్మాగార ఉద్యోగులు నివాసముండే 7క్వార్టర్స్‌లో గుర్తుతెలియని దొంగలు తలుపులు గోళ్ళాలు పగలగొట్టి పెద్ద మొత్తంలో చోరీ చేశారు. వీటిలో నాలుగు క్వార్టర్స్‌లో దొంగతనం జరగలేదని మూడు కోటర్స్ లో దొంగతనం 450 గ్రాముల బంగారం, 3 కేజీల వెండి నగలు అపహరణకు గురయ్యాయని పోలీసులు అంటున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు అర్బన్ సీఐ జయచంద్ర తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్లను పిలిపించి దర్యాప్తు చేపట్టారు. రేణిగుంట క్రైమ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం, క్రైమ్ డిఎస్పి శ్యాంసుందర్ సంఘటన స్థలం చేరుకొని దొంగతనం జరిగిన విధానాన్ని పరిశీలించారు. కంపెనీ ఉద్యోగుల ద్వారా వివరాలను అడిగి తెలుసు ఉన్నారు.

## ఘనంగా ఎన్సీసీ 78వ వార్షికోత్సవం



తిరుపతి విద్య, నవంబర్ 22 ప్రభాతవార్త: తిరుపతి ఎన్ సీసీ నగర్ లో శనివారం 78వ ఎన్ సీసీ వార్షికోత్స వం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ సీసీ గ్రూప్ క్యాప్టెన్ ఆర్జె ఆత్రే ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ జాతీయ సమైక్యత,పర్యావరణ పరిరక్షణ, క్రమశిక్షణ, దేశాభివృద్ధిలో యువత పాత్ర,దేశభక్తి ప్రధానాంశ లుగా ఎన్ సీసీ 78 ఏళ్ల క్రితం భారత దేశ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి పూర్తి స్థాయిలో విజయవంతంగా నడుస్తోందని కొనియాడారు.విద్యార్థులు ఎన్సీసీలో చేరేందుకు దృష్టి సారించా లని, తల్లిదండ్రులు సైతం విద్యార్థులను ఎన్సీసీలో చేరేందుకు ప్రోత్స హించాలని సూచించారు.విద్యార్థి జీవితంలో అకడమిక్ విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ అలవరుచుకోవాలని, దీంతో విద్యార్థి జీవితం ఉన్నత శిఖరాలను అధురోహిస్తుందని తెలిపారు.అనంతరం జాతీయ జెండాకు ఎన్సీసీ అధికారులు,5వ బెటాలియన్ మహిళా క్యాడెట్లు గౌరవ వందనం చేశారు.అనంతరం ఎన్సీసీ నగరలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో తిరుపతి ఎన్సీసీ గ్రూప్ కు చెందిన కల్నల్స్,ఎన్సీసీ అధికారులు,పలు గ్రూప్ కు చెందిన ఎన్సీసీ క్యాడెట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలు.. సమాజ సేవకే ఎన్టీఆర్ స్మారక ట్రస్ట్ : భువనేశ్వరి



కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త: ప్రజలు, సమాజసేవ కోసమే ఎన్టీఆర్ స్మారక ట్రస్ట్ పనిచేస్తోందని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. శనివారం పిఇఎస్ ఆడిటోరియంలో 48మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు,30మంది చిరు వ్యాపారులకు తోపుడుబళ్లను ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున పంపిణీ చేశారు. ఈసందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ పేర్కొన్న మానవసేవే మాధవ సేవ స్ఫూర్తితో తమ ట్రస్ట్ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ట్రస్ట్ తరపున నాలుగు బ్లడ్ బ్యాంకులు ప్రారంభించి 5లక్షల బ్లడ్ యూనిట్లు 9లక్షల మందికి ఉచితంగాఅందించామన్నారు. అలాగే తలసేనియాతో బాధపడుతున్న పిల్లలకు ఉచిత రక్తమార్పిడి చేయిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య కేంద్రం ద్వారా 2.25లక్షల మందికి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశామన్నారు. అలాగే గ్రామీణప్రాంత ప్రజల సౌకర్యార్థం నాలుగుమొబైల్ హెల్త్ బస్సులు ఏర్పాటుచేసి గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. స్త్రీశక్తి హస్తకళ కేంద్రం హైదరాబాద్‌లో ప్రారంభించామని చేతివృత్తి చేస్తున్నమహిళలు తమ ఉత్పత్తులు ఆ కేంద్రానికి అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సిఇఒ రాజేంద్రకుమార్,ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, కడ పిడి వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, లబ్దిదారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

### 27వేల మంది రైతులకు...
## రూ.18కోట్లు పిఎం కిసాన్ నిధులు

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని 27వేల మంది ంరైతులకు రూ.18కోట్లు పిఎం కిసాన్ నిధులు కేంద్రం అ ందించిందని శ్రీకాళహస్తి వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి శనివారం తెలిపారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ నమోదు చేసుకున్న ప్రతి రైతు ఖాతాలో రూ.7వేలు ంరెండో విడత పిఎం కిసాన్ నిధులు జమఅయ్యాయని తెలిపారు. ఏ రైతుకు అయినా అందలేదంటే వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి రాకపోవటానికి కారణాలు, నమోదు చేయాల్సిన రికార్డులు ఏమైనా పొందుపరచలేదా? పరిశీలించుకోవాలన్నారు.ఇందులో కేంద్ర ప్రభుత్వం అందించిన రూ.2వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.5వేలు వెరసి రైతు ఖాతాల్లో జమచేసామన్నారు. శ్రీకాళహస్తి వ్యవసాయ డివిజన్‌లోని ఐదు మండలాల్లో 27వేల 647 మంది రైతులకు రూ.18.64కోట్లు అందాయని రైతులు అనందోత్సాహాలతో ఉన్నారన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న దృష్ట్యా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని రమేష్ రెడ్డి ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. కొందరు రైతులకు ఆధార్‌కార్డు,భూఖాతాలకు లింక్ కాకపోవటం,వెబ్ ల్యాండ్‌లో నమోదు కాకపోవటం వంటి లోపాల కారణంగా నిధులు జమకాకపోయి ఉండవచ్చునని ఆయన వివరించారు. వాటిని సరి చేస్తే రాబోయే కాలంలో అందుతాయని వివరించారు.

## ఎర్రచందనం అక్రమరవాణా కట్టడికి చర్యలు

### -టాస్క్‌ఫోర్స్ ఏఎస్పీ కులశేఖర్



తిరుపతి,నవంబర్ 22ప్రభాతవార్త: అటవీసంపద ఎర్రచందనం అక్రమరవాణా కట్టడికిపై అధికారుల ఆదేశాలను అమలుచేస్తూ పనిచేస్తామని టాస్క్‌ఫోర్స్ ఏఎస్పీ కులశేఖర్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ విభాగం అదనపుఎస్పీగా నియమితులైన ఆయన శనివారం తిరుపతికార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం తిరుపతి జిల్లా ఎస్పీ,టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు,ఎస్పీ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఆయన తిరుపతి జిల్లా శాంతిభద్రతల విభాగం ఎఎస్పీగా పనిచేశారు. సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఓపెన్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్స్ ప్రారంభించిన శాప్ ఛైర్మన్



తిరుపతి క్రీడ, నవంబర్ 22 ప్రభాతవార్త : తిరుపతి ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన 22వ ఓపెన్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్స్ కార్యక్రమం ఎంతో వైభవంగా, క్రీడాస్ఫూ ర్తిని ప్రతిబింబించే రీతిలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజ రైన శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ బ్రిడ్జ్ వంటి క్రీడలు కేవలం గేమ్స్ మాత్రమే కాదు, అవి వ్యక్తిలో మానసిక చురుకుదనం, వ్యూహాత్మక ఆలోచన, సమయోచిత నిర్ణయ సామర్థం, సమన్వయ భావన వంటి విలువైన లక్షణాలను పెంచుతాయని పేర్కొన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు యువతలో మేధో వికాసానికి తోడ్పడటమే కాక, సామాజికంగా అనుబంధాలను బలోపేతం చేస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, టోర్నమెంట్ ఆర్గనైజర్ రవీంద్ర, బ్రిడ్జ్ గేమ్ అసోసియేషన్ సభ్యులు పి. నరసింహారావు, పి. నాగరాజు, సత్యరాజు, ఆర్. రమేష్, డి. రవి, కే. గురప్ప, పలువురు కూటమి నాయకులు, బ్రిడ్జ్ క్రీడాకారులు పాల్గొన్నారు.



తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో కళాబృందాలు.

ప్రభాతవార్త, తిరుచానూరు